క్లుప్తంగా

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



కౌతాళం: మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాలకు శనివారం భక్తులు అధికంగా తరలి వచ్చి పూజలు నిర్వహించారు. దీంతో స్వామి ఆలయాలు భక్తులతో సందడిగా మారాయి. మండల కేంద్రంతో పాటు అగసలదిన్నె, బుడుములదొడ్డి, ఎరిగేరిలో వెలసిన పులిగట్టు ఆంజనేయస్వామి దేవాలయాల్లో స్వామికి ప్రత్యేక పూజలను చేపట్టారు. తెల్లవారుజామున అర్చకులు స్వామి వారికి సుప్రభాతసేవ, మహా మంగళహారతి, ఆకుపూజ, పంచామృతాభిషేకంతో పాటు నిత్య పూజలు జరిపించారు.

ఉపాధ్యాయుల ఘర్షణపై విచారణ



ఉపాధ్యాయులను విచారిస్తున్న డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి

ఆదోని సెంట్రల్: స్థానిక పురపాలక ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుల మధ్య జరిగిన ఘర్షణపై డిప్యూటీ ఈఓ వెంకటరమణారెడ్డి శనివారం పాఠశాలకు వెళ్లి ఉపాధ్యాయులతో మాట్లాడారు. ఘర్షణకు దారి తీసిన కారణాలపై ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఘర్షణకు పాల్పడిన ఉపాధ్యాయుడు సురేష్‌ను పిలిపించి మాట్లాడారు. సర్వీస్ రిజిస్టర్‌లో డేటా ఎంట్రీలు సరిగా లేవు, వాటిని సరి చేయాలని హెచ్‌ఎంతో మాట్లాడామే తప్ప ఘర్షణకు పాల్పడలేదని లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చినట్లు డిప్యూటీ ఈఓ తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని చెప్పారు.

పైథాన్‌తో అపార ఉద్యోగ అవకాశాలు



పైథాన్ ప్రోగ్రామింగ్ గురించి వివరిస్తున్న పి.ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి

ఆదోని రూరల్: విద్యార్థులు పైథాన్ ప్రోగ్రామింగ్ నేర్చుకుంటే అపార ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని కళాశాల సెక్రటరీ పి.ఎస్.విష్ణువర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆదోని–ఆలూరు రహదారిలోని భీమా ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు ఆరు రోజులపాటు పైథాన్ ప్రోగ్రామింగ్ వర్క్‌షాప్‌ను 360 డీజీటీఎంజీ హైదరాబాద్ వారు నిర్వహించారు. ఈ వర్క్‌షాప్ గురించి ఆయన మాట్లాడుతూ డేటా సైంటిస్ట్ ప్రణమ్, శివకుమార్ పైథాన్ ప్రోగ్రామ్‌లోని వివిధ నైపుణ్యాల గురించి విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. కళాశాల ప్రిన్సిపాల్ జి.ఎస్ సురేంద్ర బాబు, సీఎస్‌ఈ విభాగాధిపతి ఆల్బర్ట్, అధ్యాపకులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌ను కలిసిన నూతన తహసీల్దార్



సబ్‌కలెక్టర్‌ను కలిసిన తహసీల్దార్ ఆర్.శివరాముడు

ఆదోని రూరల్: ఆదోని మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన ఆర్.శివరాముడు శనివారం పట్టణంలోని సబ్ కలెక్టర్ చాంబర్‌లో సబ్‌కలెక్టర్ శివనారాయణశర్మను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని ఆదేశించారు. అంతకు ముందు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయనను రెవెన్యూ అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన తహసీల్దార్ మాట్లాడుతూ తాను రైల్వేకోడూరు నుంచి బదిలీపై ఇక్కడికి బదిలీపై వచ్చానన్నారు.

బిడ్డకు ముర్రుపాలు పట్టించాలి

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని కడివెళ్ల గ్రామంలో శనివారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే తల్లి పాలు పట్టించాలని, ముర్రుపాలు బిడ్డకు అమృతంతో సమానమని చెప్పారు. పాలలో వ్యాధి నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందనిశ తెలిపారు. అంగన్‌వాడీ టీచర్లు బంగారమ్మ, సుమలత, అక్తర్‌బాను పాల్గొన్నారు.

పట్టణంలో వైద్య శిబిరం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని పద్మశాలి కల్యాణ మండపంలో సుందరయ్య స్ఫూర్తి కేంద్రం ఆధ్వర్యంలో షబ్రక్ 4వ వర్ధంతి సందర్భంగా శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక శాంతి నర్సింగ్ హోంనిర్వాహకులు డాక్టర్ మాలకొండయ్య, తేజ ఆస్పత్రి వైద్యులు రవితేజ, దంత వైద్యులు భరత్‌కుమార్ రోగులను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. నిర్వాహకులు రంగస్వామి పాల్గొన్నారు.

భారం నీదే.. ఈరన్నా!

- ఉరుకుంద ఉత్సవాల ఏర్పాట్లలో అధికారుల నిర్లక్ష్యం
- నేటికీ పూర్తవని ఏర్పాట్లు
- వేలాలకు రాజకీయ గ్రహణం
- టెంకాయల విక్రయ వేలాలపై కోర్టుకు
- సోమవారం నుంచి శ్రావణమాసోత్సవాలు
- ఇప్పటికే భారీగా చేరుకున్న భక్తులు



క్షేత్రం ముంగిట పూర్తిగాని పెండాల్స్ పనులు



కొనసాగుతున్న క్యూలైన్ల ఏర్పాట్లు

మంత్రాలయం : తెల్లవారితే వెల్లువలా తరలివచ్చే భక్తజనం.. వారికి అవసరమైన ఏర్పాట్లు అంతంతమాత్రమే..అసలు ఉత్సవాల బాధ్యత మోసేదెవరు? ఆలయ హోదా పెరిగిన మొదటి ఏడాదే మొక్కుబడిగా ఏర్పాట్లు కానిస్తున్నారు.. మొత్తానికి క్షేత్రంలో అన్నీ ప్రశ్నార్థకమే. గతంలో ఉత్సవాలకు రెండు నెలల ముందే ఏర్పాట్లు మొదలయ్యేవి. ఈ సారి ఇటు పాలకులు, అటు అధికారులుగానీ ఉత్సవ ఏర్పాట్లపై ఆసక్తి చూపలేదు. ఈ నేపథ్యంలో ఈరన్న స్వామి వేడుకలు ఎలా సాగుతాయో స్వామికే ఎరుక..

నెల పాటు ఉత్సవాలు..

జిల్లాలో దేవదాయశాఖ నిర్వహణలోనున్న ప్రధాన ఆలయాల్లో ఉరకుంద ఈరన్న స్వామి క్షేత్రం ఒకటి. ఏటా శ్రావణమాసంలో ఇక్కడ మాసోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. నెలరోజులు పాటు అంగరంగ వైభవంగా ఉత్సవాలు జరుగుతాయి. ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి లక్షలాదిగా భక్తులు వస్తారు. ఈ మాసంలో దాదాపు 12 లక్షల భక్తులు స్వామిని దర్శించుకుంటారు. సోమవారం నుంచి ఇక్కడ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. సోమ, గురు, శనివారాలు ప్రత్యేక ఉత్సవ దినాలు. ఆరోజుల్లో భక్తులు లక్షల్లో స్వామి సేవలో తరిస్తారు. వచ్చే అమావాస్య వరకు వేడుకలు కొనసాగుతాయి.

వేలాలకు రాజకీయ గ్రహణం..

ఉత్సవాల వేలాలకు రాజకీయ గ్రహణం పట్టింది. అధికార పార్టీ ముఖ్య నాయకుల వ్యూహంలో భాగంగా నెల రోజులు వేలాలు వాయిదా పడ్డాయి. వేలాలు జూన్ మొదటి వారంలో జరగాల్సి ఉండగా 30వ తేదీన పూర్తి చేశారు. అందులో కొన్ని వేలాలు పూర్తి కాగా.. టెంకాయల విక్రయాల వేలంలో సందిగ్ధత నెలకొంది. జూన్ 30న రూ.70 లక్షలకు ఓ ఏజెన్సీ టెంకాయల విక్రయాలను సొంతం చేసుకుంది. గంటలోపే వేలం మొత్తాన్ని చెల్లించాలని షరతు పెట్టడంతో వేలం రద్దు చేశారు. జూలై 20న మళ్లీ టెండర్ వేయగా మరో ఏజెన్సీ రూ.64 లక్షలతో పాడింది. కాగా ఇదే టెంకాయల వేలాన్ని రూ.70 లక్షలకు పాడిన ఏజెన్సీ హైకోర్టును ఆశ్రయించింది. తమకు సమయం ఇవ్వకుండా వేలాన్ని రద్దు చేయడం సరికాదని, తక్కువ టెండర్ దాఖలు చేసిన ఏజెన్సీకి వేలాన్ని ఇవ్వడం పద్ధతి కాదని హైకోర్టులో కేసు వేశారు. ఈనెల 30న సదరు కేసును హైకోర్టు 6వ తేదీకి వాయిదా వేసింది. ఉత్సవాలు మాత్రం 4వ తేదేనే ప్రారంభం కానున్నాయి. టెంకాయల వేలం విషయంలో సందిగ్ధం నెలకొనడంతో భక్తులకు టెంకాయలను ఎలా సరఫరా చేస్తారో గందరగోళం నెలకొంది. తీర్పు వస్తేనే టెంకాయల విక్రయాలు సాఫీగా సాగే అవకాశం ఉంది. లేదంటే టెంకాయలు దొరకక భక్తులు ఇబ్బంది పడే అవకాశం ఉంది. టెంకాయల వేలం వెనుక టీడీపీ ముఖ్య నాయకుల ఒత్తిళ్లు ఉన్నట్లు సమాచారం.

గట్టెక్కని ఏర్పాట్లు..

ఉత్సవాలకు 24 గంటల సమయమే మిలిగి ఉంది. ఇలాంటి తరుణంలోనూ ఉత్సవ ఏర్పాట్లు కొనసాగుతూనే ఉన్నాయి. ఆలయం ముంగిట పెండ్యాల్స్, దర్శన క్యూలైన్లు, దుస్తుల మార్పిడి షెడ్లు, మొబైల్ టాయిలెట్లు, తాగునీటి వసతులు, విద్యుద్దీపాల ఏర్పాట్లు సగం కూడా పూర్తికాలేదు. ఆదివారం అమావాస్య, సోమవారం వేడుకల ప్రారంభం కానుండటంతో ఇప్పటికే వేలాది మంది భక్తులు ఉరకుంద చేరుకున్నారు. పాదయాత్ర భక్తులు రెండు రోజులుగా క్షేత్రానికి పోటెత్తారు. ఈ తరుణంలో ఏర్పాట్లు ఒక రూపునకు రాకపోవడంతో భక్తులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తూ..అధికారుల నిర్లక్ష్యాన్ని తప్పుబడుతున్నారు.

బిహార్ కూలీలకు బియ్యం అందజేత

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఏనుగుబాల గ్రామంలో విద్యుత్ లైన్ పనుల కోసం వచ్చిన బిహార్ యువకులకు యువకుడు సింగనేటి శివకుమార్ శనివారం సాయంత్రం యాభై కేజీల సోనామసూరి బియ్యం అందచేశారు. పనికోసం వచ్చిన యువకులు తినడానికి రేషన్ బియ్యం అయిపోయాయని, కాంట్రాక్టర్‌కు చెప్పినా పంపలేదని సింగనేటి శివకుమార్ దృష్టికి తీసుకెళ్లాడు. స్పందించిన ఆయన 50 కేజీల బియ్యం బస్తాను అందజేయడంతో యువకులు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించండి

ఎమ్మిగనూరుటౌన్: విద్యారంగంలో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని పీడీఎస్‌ఓ జిల్లా ఉపాధ్యక్షుడు సురేంద్రబాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల నుంచి విద్యార్థినులతో ర్యాలీగా వెళ్లి డిప్యూటీ తహసీల్దార్ శ్రీదేవికి వినతిపత్రం ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ ఏ సిలబస్, ఏ మీడియం అమలు చేయనున్నారనే విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం నేటికి స్పష్టం చేయలేదన్నారు. దీంతో విద్యార్థులు,ఉపాధ్యాయులు ఇబ్బందులు పడాల్సివస్తుందన్నారు. పాఠశాలల విలీనాన్ని నిలిపివేసి రాష్ట్రంలోని ప్రాథమిక పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 39,008 పోస్టులను, ఉన్నత పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 11,888 పోస్టులు డీఎస్సీలో నోటిఫికేషన్‌లో చూపించి భర్తీ చేయాలన్నారు.

నేడు స్నేహితుల దినోత్సవం





పట్టణంలోని ఓపాఠశాలలో ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లను తమ స్నేహితులకు కడుతున్న విద్యార్థినిలు

ఎమ్మిగనూరుటౌన్: దోస్త్‌మేరా దోస్త్..తుహై మేరా జాన్, వాస్తవంరా దోస్త్..నువ్వే నాప్రాణం... ముస్తఫా ముస్తఫా ...డోంట్ వర్రీ ముస్తఫా..ప్రాణం నీనేస్తం ముస్తఫా... ఇలా స్నేహ బంధాన్ని వివరిస్తూ ఎన్నో సినీ గేయాలు వచ్చాయి. ఎందరో రచయితలు తమ కలం ద్వారా స్నేహం విలువలను తెలియజేశారు.అనుభవిస్తే గాని స్నేహబంధం..అందులోని మాధుర్యం తెలియదు.అనందంలోనే కాదు..ఆపదలు..కష్టసుఖాలలోనూ తోడుండేవాడు స్నేహితుడు. స్నేహితుల దినోత్సవం సంధర్బంగా కొందరు బాల్య స్నేహితులు, హైస్కూల్ స్థాయి నుంచి చదువుకొని ఉద్యోగాలలో స్థిరపడిన మిత్రులు స్నేహానుబంధాన్ని గుర్తు చేసుకుంటున్నారు.

ఫ్రెండ్‌షిప్ దేవుడిచ్చిన వరం



ఫ్రెండ్‌షిప్ అనేది దేవుడిచ్చిన వరం లాంటిది. నా బాల్య స్నేహితులు హైస్కూల్ స్థాయి నుంచి ఉన్నారు. టెన్త్ బ్యాచ్ స్నేహితులం ఇప్పటికీ కలుస్తూనే ఉంటాం. టెన్త్ పూర్తయి 34 ఏళ్లు అయినా ఇప్పటికీ నెలకు ఒకసారైన కలుస్తుంటాం. ఆ కలయిక అనుభూతి మాటల్లో చెప్పలేం.

పాటిల్ ఈశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయుడు,ఎమ్మిగనూరు

బడ్జెట్‌లో ఎక్కువ నిధులు కేటాయించాలి

ఆదోని రూరల్: కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌లో కార్మికులకు ఎక్కువ నిధులు కేటాయించి పని, ఉద్యోగ భద్రత కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అంజిబాబు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు రెండో రోజు పి.ఎస్.గోపాల్ అధ్యక్షతన కొనసాగాయి. వారు మాట్లాడుతూ గతంలో 44 లేబర్ కోడ్‌లు ఉన్నాయని, బీజేపీ ప్రభుత్వం వాటిని మార్చి నాలుగు లేబర్ కోడ్‌లను అమలు చేస్తుందని, వాటి ద్వారా కార్మికులకు తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం స్కీం వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు అందజేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకులు పి.ఈరన్న, మహానందరెడ్డి, అధ్యక్ష కార్యదర్శులు తిప్పన్న, వీరారెడ్డి,రామాంజనయులు తదితరులు పాల్గొన్నారు.

సీఆర్పీలకు వెయిటేజ్ మార్కులు కలపాలి

గోనెగండ్ల:సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఏపీ డీఎస్సీలో ఉపాధ్యాయ పోస్టులకు వెయిటేజ్ మార్కులు కలపాలని సమగ్ర శిక్ష ఉద్యోగులు పుల్లన్న, రవి కోరారు. శనివారం స్థానిక కస్తూర్బా బాలికల పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్నారన్నారు. పెరిగిన చార్జీలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, గతంలో పనిచేసిన వారికీ సర్వీస్ పాయింట్లు కాలపాలని జేఏసీ చైర్మన్ నానిని కోరారు. కార్యక్రమంలో జేఏసీ కమిటీ సభ్యులు స్రవంతి, రమాదేవి, కళ్యాణి, హసీనా,ఉమా, శ్రావణి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను పరిష్కరించాలి

కోసిగి: ప్రజా సమస్యలలను తక్షణమే పరిష్కరించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ యాదవ్, సీపీఐ మండల కార్యదర్శి గోపాల్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సీపీఐ కార్యాలయ ఆవరణలో డీహెచ్‌పీఎస్ తిక్కయ్య అధ్యక్షతన రైతులు, కార్యకర్తలతో సమావేశమైయ్యారు. వారు మాట్లాడుతూ రైతులకు పెట్టుబడి సాయం కింద జూన్ నెలలో రావాల్సిన పెట్టుబడి సాయం ఇంత వరకు అందలేదన్నారు. ఉపాధి హామీ పథకం కింద పనిచేసిన కూలీలకు పది వారాలుగా వేతనాలు అందలేదని, దీంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏఐటీయూసీ మండల కార్యదర్శి రాజేంద్ర, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి వీరేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్ తనిఖీ

ఆదోని రూరల్: పట్టణంలోని సమీకృత సాంఘిక బాలికల వసతి గృహాన్ని సబ్‌కలెక్టర్ శివనారాయణ శర్మ శనివారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. సబ్ కలెక్టర్ విద్యార్థినులతో మాట్లాడి వసతిగృహంలో ఆహారం, తాగునీరు, ఇతర వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఏదైనా సమస్యలు ఉంటే నేరుగా తన వద్దకు వచ్చి చెప్పవచ్చన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థి దశలోనే గమ్యాన్ని నిర్దేశించుకుని వాటి కోసం రోజూ సాధన చేసి గ్రాడ్యుయేషన్ పూర్తయ్యేసరికి గమ్యాన్ని చేరేలా ప్రణాళికలు సిద్ధం చేసుకుని విద్యనభ్యసించాలని చెప్పారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ శివనారాయణ శర్మ

ఆదర్శ మిత్రులు

- చిన్ననాటి మిత్రులంతా కలిసి ఆదర్శ మిత్ర మండలి ఏర్పాటు
- నేటికీ కొనసాగుతున్న స్నేహ బంధం
- పాఠశాలలు, పేద విద్యార్థులకు అండగా నిలుస్తున్న వైనం

ఆదోని సెంట్రల్: వారంతా ఆదోని వాసులు. పాఠశాల విద్య వరకు వివిధ బడుల్లో చదివినా ఇంటర్‌లో మాత్రం 1988–90లో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో చదువుకున్నారు. కళాశాలలోని 13 మంది జూనియర్లు, సీనియర్లు స్నేహితులుగా మారారు. ఇంటర్ తరువాత ఉన్నత చదువుల అనంతరం కేశవయ్య, సతీష్ నీవర్తి, వాణి, అనంత్, మధు హహేష్, సుధాకర్, రవి ప్రకాశ్‌రెడ్డి, సునీల్ రెడ్డి, వంశీకృష్ణా రెడ్డి, బాలాజీ, రాజశేఖర్ రెడ్డి, నరేష్, రామకృష్ణ తదితరులు మొత్తం 13 మంది మిత్రులు ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. వీరంతా ఏటా.. శ్రావణమాసంలో పట్టణ సమీపంలోని రణమండల కొండపై కలుసుకొని సంతోషంగా గడిపేవారు. అయితే వారిలోని కొందరు.. మన సంతోషం ఇతరులకు కూడా పంచితే ఎలా ఉంటుందని ప్రస్తావించారు. అంతే మరోసారి అందరూ కలుసుకొని ఆలోచించి సమాజసేవకు నడుంబిగించి 2012లో సతీష్ నీవర్తి అధ్యక్షుడిగా ఆదర్శ మిత్రమండలి ఏర్పాటు చేశారు.

కొనసాగుతున్న స్నేహం..సేవ..

నాడు ప్రారంభించిన సేవా కార్యక్రమాలకు ఆ 13 మంది మాత్రమే కలిసికట్టుగా నిర్ణయాలు తీసుకుంటున్నారు. ఏటా ప్రభుత్వ పాఠశాలలకు, పేద విద్యార్థులకు, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి ఆర్థికంగా సాయం చేసి ఆదుకుంటున్నారు. ఇటీవల పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థుల తాగునీటి అవసరాల నిమిత్తం రూ.లక్షకు పైగా వెచ్చించి బోరు వేయించారు. అమరావతి నగర్‌లో ఉన్న ప్రభుత్వ పాఠశాలకు ఫర్నీచర్, సరస్వతి శిశు మందిర్‌లో విద్యార్థుల సౌకర్యార్థం టాయిలెట్స్ నిర్మాణాలు చేపట్టారు. అలాగే.. మంత్రాలయం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు ఫర్నీచర్ అందజేశారు. మండలంలోని పెద్దహరివాణం ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు క్రికెట్ కిట్లను అందించారు. ఎమ్మిగనూరు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలకు రెండు ప్రింటర్లు విరాళంగా ఇచ్చారు. పేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు వంటివి పంపిణీ చేశారు.



ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో బోర్ వేయించిన ఆదర్శమిత్ర మండలి సభ్యులు

సంతోషంగా ఉంది



మిత్రులు గ్రూపుగా ఏర్పడి సేవా కార్యక్రమాలు చేయడం సంతోషంగా ఉంది. జీవితంలో స్నేహ బంధం ఎంతో మధురమైనది, చిరస్థాయిగా నిలిచిపోయేవి చాలా తక్కువ. మనం మన స్నేహితులతో పంచుకున్న జ్ఞాపకాలు, గడిపిన మధురమైన క్షణాలు చిరకాలం గుర్తుంటాయి. బంధాలను సంపాదించుకోవడం ఎంత ముఖ్యమో వాటిని అంతే బలంగా కొనసాగించడం మరింత ముఖ్యం. రెండు వైపుల నుంచి అనుబంధం ఉండటంతోనే తామంతా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తూ అవసరార్థులకు అండగా నిలుస్తున్నాం.

– సతీష్ నీవర్తి, ఆదర్శ మిత్ర మండలి అధ్యక్షుడు

అర్హతకు మించి వైద్యం చేస్తే చర్యలు



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి

గోనెగండ్ల : ఆర్‌ఎంపీలు, పీఎంపీలు అర్హతకు మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సత్యవతి, 104 జిల్లా నోడల్ ఆఫీసర్ డాక్టర్ బాల మురళికృష్ణలు హెచ్చరించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఆర్‌ఎంపీలు, పీఎంపీలతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కొందరూ ఎలాంటి అర్హత లేకున్నా క్లినిక్‌లు నడుపుతూ ఆర్‌ఎంపీ వైద్యులమంటూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. ఎవరైన వైద్యం కోసం ఆర్‌ఎంపీల దగ్గరకు వస్తే ట్యాబ్లెట్లు, సిరాప్‌లు మాత్రమే ఇవ్వాలి తప్పా ఎలాంటి వైద్యం చేయరాదని సూచించారు. అలాగే గర్భిణులకు వైద్యం, కాన్పులు చేయరాదన్నారు. ఆర్‌ఎంపీలు నిబంధనల మేరకు వైద్య సేవలు అందజేయాలని, అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐ రామకృష్ణయ్య, గోనెగండ్ల పీహెచ్‌సీ డాక్టర్లు రవళి, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

సాగునీరందించండి సారూ.!



డీఈకి వినతిపత్రం ఇస్తున్న రైతులు

ఎమ్మిగనూరు: వర్షాభావంతో పంటలు ఎండిపోతున్నాయి..ఆయకట్టు పొలాలకు సాగునీరందించి ఆదుకోండి సారూ..అంటూ రైతులు మొరపెట్టకొన్నారు. నందవరం మండలం ముగతి గ్రామానికి చెందిన భార్గవ్‌యాదవ్, కొండన్న, సోమేష్, రంగన్న తదితర 50మంది రైతులు శనివారం ఎల్లెల్సీ డీఈ లక్ష్మణ్‌కుమార్‌ను కలసి వినతి పత్రం అందించారు. తుంగభద్ర దిగువ కాలువ పరిధిలోని చిన్నకొత్తిలి డిస్ట్రిబ్యూటరీ కింద ఆయకట్టు పొలాలకు నీరందించాలని విజ్ఞప్తి చేశారు. నెలన్నర క్రితం కురిసిన వర్షాలకు పంటలు సాగు చేశామన్నారు. పంటలు ఏపుగా పెరిగిన తర్వాత వర్షాలు కురువలేదని, దీంతో వాడుపట్టాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఎల్లెల్సీ నీటిని అందించి ఆదుకోవాలని రైతులు డీఈని కోరారు.

అసాంఘిక శక్తుల ఆగడాలకు... అడ్డుకట్ట పడేనా ?

- సీఐగా బాధ్యతలు స్వీకరించిన సుదర్శన్‌రెడ్డికి అన్నీ సవాళ్లే
- ఎమ్మిగనూరు పట్టణంలో పెట్రేగిపోతున్న అసాంఘిక శక్తులు
- రేషన్ బియ్యం దందాలు, గ్యాంగ్‌లకు కేంద్రంగా మారిన వైనం

ఎమ్మిగనూరు: నూతనంగా పట్టణ సీఐగా బాధ్యతలు స్వీకరించిన సుదర్శన్‌రెడ్డికి అసాంఘిక కార్యక్రమాలు స్వాగతం పలుకుతున్నాయి. అభివృద్ధికి అడ్డాగా..ప్రశాంతతకు పెట్టింది పేరుగా ఉన్న ఎమ్మిగనూరు పట్టణం ప్రస్తుతం ఇందుకు భిన్నంగా మారింది. పట్టణంలో భూ దందాలు, పోలీసు–పొలిటికల్ సెటిల్‌మెంట్‌లు రాజ్యమేలుతున్నాయి. యువత నిరుద్యోగాన్ని..విలాసాలను అందిపుచ్చుకున్న రాజకీయ బ్రోకర్లు యువతతో గ్యాంగ్‌లను కట్టించి ప్రొత్సహిస్తున్నారు. శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన పోలీసులు విధుల్లో నిర్లక్ష్యంపై విమర్శలు వెల్లువెత్తుతున్న పరిస్థితి నెలకొంది. 2014నుంచే పైరవీలతో, పైసలతో పోస్టింగ్‌లు తెచ్చుకునే పోలీసు అధికారులు ఎక్కువయ్యారు. ఎమ్మిగనూరు సర్కిల్ బాసులు ఆదాయ మార్గాలపైనే దృష్టి పెడుతూ వచ్చారన్నది జిల్లా ఉన్నతాధికారులు తేల్చిన నిజం. ఇక రియల్ దందాలు, పొలిటికల్ సెటిల్‌మెంట్లతో స్టేషన్లు బిజీగా మారాయి. అదేవిధంగా పట్టణంలో నెలకొన్న ట్రాఫిక్ సమస్య తలనొప్పిగా మారింది. ఏకంగా మునసబ్ కోర్టు మేజిస్ట్రేట్ పోలీసులను హెచ్చరించినా మార్పు శూన్యం. కళాశాలల వద్ద విద్యార్థినులను వేధించే పోకిరీలు ఎక్కువయ్యారు. అరికట్టాల్సిన పోలీసులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రెచ్చిపోతున్న గ్యాంగ్‌లు

గతంలో విద్యార్థులు ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ లాంటి సంఘాల సభ్యులంటూ చెప్పుకునే పరిస్థితి నుంచి... నేడు నేను ఫలానా గ్యాంగ్ సభ్యుడనీ... మా అన్నా, తమ్ముడు ఫలానా గ్యాంగ్‌లో ఉన్నాడంటూ కళాశాలల్లో కాలర్ ఎగురేసే సంస్కృతి దాపురించింది. ఇలాంటి గ్యాంగ్‌లకు రాజకీయ బ్రోకర్లు వత్తాసు పలుకుతూ వారిని 'మత్తు'కు బానిసలుగా మార్చుతున్నారు. పట్టణంలోని మైనార్టీ కాలనీ, శివన్ననగర్, అబ్బాస్ థియేటర్, ఎన్టీఆర్ కాలనీ బోర్డు ప్రాంతాల్లో యువత గంజాయి మత్తులో చిత్తవుతున్నారని ప్రజలే అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల గంజాయి మత్తులో ఒకే గ్యాంగ్‌లోని ఇద్దరు యువకులు కత్తితో పొడుచుకున్నారు. ఎమ్మిగనూరు మండల పరిధిలోని ఓ గ్రామం నుంచి గంజాయి తెస్తూ ఈ గ్యాంగ్ సభ్యుడు తన మోటార్‌సైకిల్‌తో సహా పట్టుబడినా చర్యలు నామమాత్రం. స్పెషల్ బ్రాంచ్ అధికారులు ఎమ్మిగనూరులో జరుగుతున్న గంజాయి దందాపై ఆధారాలు సేకరించినా ఎందుకో ముందుకు వెళ్లలేక పోయారని పోలీస్ శాఖలోనే చర్చ జరిగింది. పట్టణంలో జరిగే పలు అల్లర్లల్లో ప్రత్యక్షంగానో, పరోక్షంగానో గ్యాంగ్‌ల పాత్ర నిత్యకృత్యమైంది.

యథేచ్ఛగా బియ్యం అక్రమ రవాణా...

రేషన్ బియ్యం అక్రమ రవాణాకు ఎమ్మిగనూరు కేంద్రంగా మారింది. సంజీవ్‌నగర్, శివన్ననగర్, అబ్బాస్ థియేటర్ సమీపంలో ఉన్న కొంతమంది యథేచ్ఛగా బియ్యం అక్రమ రవాణా కొనసాగిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఎమ్మిగనూరుకు చెందిన ఓ బియ్యం వ్యాపారి(డీలర్) తన అక్రమ బియ్యపు వ్యాపారానికి గ్రీన్ సిగ్నల్ ఇస్తే రూ.20లక్షలు ఇస్తానంటూ రాజకీయ భేరం కూడా కుదుర్చుకున్నట్లు నియోజకవర్గంలో చర్చ సాగుతోంది. బియ్యం దందాకు కొందరు పోలీసుల పరోక్ష సహకారం ఉన్నట్లు ప్రచారం లేకపోలేదు. అదేవిధంగా క్రికెట్ బెట్టింగ్, చిట్టీలపేరుతో కుచ్చుటోపీలు పెట్టడం, అధికవడ్డీలకు వ్యాపారులను నడ్డి విరిచే కాల్‌మణి కేటుగాళ్లు ఎక్కువయ్యారు.

పుష్కలంగా కర్ణాటక, తెలంగాణా మద్యం

పట్టణంలో కర్ణాటక, తెలంగాణ మద్యం పుష్కలంగా లభిస్తుంది. ప్రజాప్రతినిధులు, ఎక్స్ ఆర్మీ సభ్యుల ముసుగులో మద్యం అక్రమ రవాణా కొనసాగుతూనే ఉందంటూ నిఘావర్గాలు పేర్కొంటున్నాయి. ఇక పట్టణంలో పేదల ఇళ్లస్థలాల పేరుతో మిల్టరీ, మైనార్టీ కాలనీల్లో సామాజిక సేవకులుగా చలామణి అవుతున్నవారు చేస్తున్న దందాలు, భూకబ్జాలు, లిటికెంట్ ప్రాపర్టీల కొనుగోళ్లలో ఆరితేరిన సిండికేటురాయుళ్ల సెటిల్‌మెంట్ దందాలు ఎమ్మిగనూరులో నిత్యకృత్యమయ్యాయి. ముక్కుసూటిగా వ్యవహరించే సీఐ సుదర్శన్‌రెడ్డి అసాంఘిక శక్తులను ఎదుర్కోవడం సవాలే అంటున్నారు పట్టణ ప్రజలు.

దేవనకొండలో ఎస్ఐగా మన్ననలు పొందిన సుదర్శన్‌రెడ్డి



ఎమ్మిగనూరు పట్టణ సీఐగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించిన సుదర్శన్‌రెడ్డి గతంలో ఫ్యాక్షన్ పుట్టినిల్లుగా పేరొందిన దేవనకొండలో విధులు నిర్వర్తించారు. అందరితో మమేకమవుతూ ఉత్తమ సేవందించిన సుదర్శనరెడ్డి మండల ప్రజల మన్ననలు పొందారు. అప్పట్లో పార్టీలకు అతీతంగా నాయకులు ఎస్ఐ బదిలీని ఖండించారు. రైతులు ఏకంగా రోడ్డుపై ఎడ్లబండ్లు అడ్డుగా పెట్టి అభిమానాన్ని చాటుకున్నారు. చివరకు సుదర్శన్‌రెడ్డి జోక్యం చేసుకుని సర్దిచెప్పడంతో రైతులు శాంతించారు.

విద్యార్థులకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపండి

ఎమ్మిగనూరుటౌన్: నందవరం మండలంలోని పలు గ్రామాల నుంచి ఎమ్మిగనూరులోని పాఠశాలలు, కళాశాలలకు వచ్చే విద్యార్థులకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపాలని ప్రగతిశీల విద్యార్థి సంఘం జిల్లా కార్యదర్శి సురేష్ కోరారు. శనివారం స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ అమర్నాథ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఆయన మాట్లాడుతూ పూలచింత, గంగవరం, పెద్దకొత్తిలి తదితర గ్రామాల నుంచి 80మందికి పైగా విద్యార్థులు ఎమ్మిగనూరుకు వస్తుంటారన్నారు. బస్సు సర్వీసులు నిలిపివేయడంతో బాలికలు చదువులను మధ్యలోనే ఆపేస్తున్నారని తెలిపారు. నాయకులు భూపాల్, అంజి, రవి, కార్తీక్, నవీన్, తరుణ్ పాల్గొన్నారు.

ఆస్పత్రి నిర్మాణానికి నిధులు కేటాయించండి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో నిర్మాణంలో ఉన్న వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణ పనుల పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గిడ్డయ్య డిమాండ్ చేశారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.శివారుప్రాంతాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, పైప్‌లైన్ల నిర్మాణాలు చేపట్టాలని కోరారు. పంపణ్ణగౌడ్, రంగన్న, రామాంజినేయులు, సమీవుల్లా, జబ్బార్, వీరేష్, విజయేంద్ర పాల్గొన్నారు.